క్లుప్తంగా

వైభవంగా ముగిసిన మాతమ్మతల్లి జాతర



ఆలయంలో కొలువుతీరిన మాతమ్మ తల్లి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు అరుంధతివాడలో ఆదివారం రాత్రి మాతమ్మ తల్లి జాతర ముగిసింది. మూడు రోజులపాటు ఈ జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఊరేగింపు కార్యక్రమాలు, ఆసాది కథ నిర్వహించారు. అలాగే పొంగళ్ల కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



గ్రామంలో పల్లకీపై ఊరేగుతున్న గంగమ్మ తల్లి

వీరబల్లి (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి జాతర అత్యంత ఘనంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా సోమవారం అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామంలోని అన్ని గ్రామ పంచాయితీలలో ఊరేగించారు. ఊరేగింపు గుర్రప్పగారిపల్లె నుంచి మాదిరెడ్డి గారిపల్లె వరకు నిర్వహించారు. అలాగే ఇదే రోజు చిన్న తొగటపల్లె నుంచి చౌడేశ్వరీ దేవి అమ్మవారిని కూడా ఊరేగింపుగా తీసుకొచ్చి గంగమ్మ తల్లి గుడి చుట్టూ ప్రదర్శనలు చేశారు. గ్రామంలో అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకొంటూ కొబ్బరి కాయలు కొట్టారు.

కల్యాణం.. కమనీయం

పుల్లంపేట : అనంతంపల్లి పంచాయతీ, చాపల హరిజనవాడ గ్రామంలో సోమవారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాల మధ్య కల్యాణం కన్నుల విందుగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఐ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ తులసీరామ్

సంబేపల్లె : మండల పరిధిలో శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి తిరునాల ఏర్పాట్లను సోమవారం సీఐ తులసీరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అమ్మవారి దర్శనం , పార్కింగ్, చాందినీబండ్ల ఊరేగింపు తదితర విషయాలపై ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్ రామచంద్రలతో చర్చించారు. సీఐ వెంట ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

నివాళి

చిన్నమండెం : వైఎస్సార్‌సీపీ నాయకులు యేహియాఖాన్, సుగతుల్లాఖాన్ మాతృమూర్తి బికాతుబి మృతి పట్ల జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం బికాతుబికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఏజాస్‌అలీఖాన్, వెంకటప్పనాయుడు, సర్పంచులు నజీర్‌అహమ్మద్, లోకేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, నాయకులు గౌస్‌సాబ్, జహీర్, బురాన్‌ఖాన్ సజాదు పాల్గొన్నారు.

పరామర్శ: వైఎస్సాఆర్‌సీపీ నాయకుడు సాదిక్ ఇటీవల వెన్నెముకకు కండ పెరగడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సాదిక్‌ను దేవనాథరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీదే గెలుపు



మాట్లాడుతున్న రాజంపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవి

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాజంపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అన్ని వర్గాలు జగనన్నకే ఇవ్వడం వలన పోలింగ్ శాతం పెరిగిందన్నారు. మహిళలు జగనన్నను పట్టం కడుతారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. రాజంపేటలో ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఆదుకుంటున్న ‘అన్నమయ్య’

- అన్నమయ్య డ్యాంలో 13 వాటర్ ఫిల్టర్లు
- పట్టణానికి మంచినీటి సరఫరా
- వేసవిలో తాగు నీటి సమస్యకు పరిష్కారం



అన్నమయ్య డ్యాంలో ఫిల్టర్లు

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో వేసవిలో కూడా నీటి సమస్యను పురపాలక సంఘం అధిగమించింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రాజంపేట పట్టణానికి కరవు వచ్చినా తాగునీటి సమస్య లేకుండా చేయాలన్న తపనతో కోట్లాది రూపాయిలు వెచ్చించి అన్నమయ్య మంచినీటి పథకాన్ని నిర్మించారు. అన్నమయ్య ప్రాజెక్టు నుంచి పట్టణానికి మంచినీటిని తీసుకువచ్చారు. పురపాలకసంఘం చైర్మన్ పోలాశ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన పాలకవర్గం ఎప్పటికప్పుడు నీటి సమస్య పరిష్కారం దిశగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి.

నీటి ఎద్దడికి పరిష్కారం

డ్యాంలో 13 ఫిల్టర్లు ద్వారా పట్టణంలోని ఏడు ట్యాంకులకు ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా ప్యూరిఫైడ్ వాటర్‌ను పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పురపాలకసంఘం ముందుచూపుతో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేసింది. అన్నమయ్య డ్యాం ప్రకృతి వలన కొట్టుకుపోయిన సందర్భంలో రాజంపేట పట్టణానికి నీటి సమస్య వస్తుందని అందరు ఊహించారు. అన్నయమ్య డ్యాం ఆధారితంగా ఏర్పాటైన భారీ మంచినీటి సరఫరా పథకం దెబ్బతింటుందని అందరూ భావించారు. ముందుచూపుతో అధికారులు సమస్యను అధిగమించారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు

అన్నమయ్య భారీ మంచినీటి పథకం నుంచి పట్టణానికి వచ్చే పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పైపులైను ప్రెజర్, పైపుల డ్యామేజీ, జాయింట్స్ వద్ద లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో పట్టణ వాసులకు సంవృద్ధిగా నీరు అందుతోంది.

పకడ్బందిగా ఏర్పాట్లు



రాజంపేట పట్టణంలో వేసవిలో సైతం నీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకున్నాము. అన్నమయ్య డ్యాంలో 13 ఫిల్టర్లు వేసి, అక్కడి నుంచి నీటిని ట్రీట్‌మెంట్‌ప్లాంట్ శుద్ధి చేసి పట్టణవాసులకు మంచి నీటిని అందచేస్తున్నాము. పైపులైను లీకేజీను ఎప్పటికప్పుడు యుద్ధప్రాతిపకదన మరమ్మతులు చేస్తున్నాము. పట్టణ వాసుల సహకారంతో పట్టణాభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నా.

పోలా శ్రీనివాసులరెడ్డి, చైర్మన్, పురపాలకసంఘం, రాజంపేట

పెత్తందారులకు కొమ్ముకాస్తున్న అధికారులు



కడపాయపల్లె దళిత భూములను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె గ్రామంలోని దళిత భూముల విషయంలో పెత్తందారులకు అధికారులు కొమ్ము కాస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వెంకటశివ ఆరోపించారు. సిద్దవటం మండలంలోని లింగంపల్లె పొలంలోని సర్వేనంబర్ 126, 127/2, 141/2 లోని 16.11 ఎకరాల భూములను లబ్ధిదారులతో కలిసి సీపీఐ, దళిత హక్కుల పోరాట సమితి, ఏ.పి. మహిళా సమైక్య, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ 16.11 ఎకరాల భూమిని కడపాయపల్లె దళితులు 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూమి మార్కెట్‌లో ధర పెరగడంతో అగ్రవర్ణాల కన్ను పడిందన్నారు. నిరుపేదల దళితుల భూములను రక్షించాల్సిన సిద్దవటం మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు కబ్జాదారులకు వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. మునెయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం, మహిళా సమైక్య జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి, ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున, సీపీఐ నాయకులు ఓబులయ్య, సీపీఎం అనుబంధం వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, సిద్దవటం మండల కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



సిద్దవటం గ్రథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించిన దృశ్యం

సిద్దవటం : పుస్తక పఠనంతో విద్యార్థులు మరింత విజ్ఞానం పొందవచ్చని గ్రంథాలయాధికారి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పిల్లల చేత పద్యాలు వాటి భావాలను చెప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి తరగతులను ఉపయోగించుకోవాలి

రైల్వేకోడూరు : గ్రంథాలయంలో వేసవిసెలవుల్లో నిర్వహించే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు మురళి ద్వారా విద్యార్థులకు తెలుగు వ్యాకరణాలు, భాషా పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం బొమ్మలు వేయడం పోటీతత్వం అలవాటు చేసుకోవడం ఈ వేసవి తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

రాయచోటి అర్బన్ : ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖలోని ఏపీ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ విభాగంలో ఐసీఆర్‌పీ ఎల్-1, ఎల్-2 ,మాస్టర్ ట్రైనర్‌లుగా పనిచేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వాలు అతితక్కువ వేతనాలతో పనిచేయించుకోవడం దారుణమన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, కార్యదర్శి భాగ్యలక్ష్మి, సభ్యుడు ఫయాజ్ పాల్గొన్నారు.

మల్లన్నా..క్షేమంగా చూడు స్వామి



అంగళ్లు మల్లయ్య కొండపై ప్రత్యేక పూజలు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై సోమవారం వివిధ ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి సోమవారం ఇక్కడ పెద్ద ఎత్తున సాంప్రదాయ మంగళ వాయిద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దకటవకు చెందిన దేరంగుల రాము, డి. రత్నమ్మ, రూప, అక్షయ, రెడ్డిప్రతాప్, పోరెడ్డి ఎల్లారెడ్డి, రేణుక తదితరులను సన్మానించారు.

విజ్ఞానం, వినోదం.. వేసవి శిక్షణా శిబిరం

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు వినోదంతోపాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తాయని కడప మండల విద్యాధికారి పాలెం నారాయణ అన్నారు. శిక్షణా శిబిరాల్లో భాగంగా స్థానిక రవీంద్రనగర్‌లోని రామకృష్ణ నగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థుల శిక్షణా విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి జరుగుతున్న కృషిని అభినందించారు. శిబిరంలో ఆటపాటలు, సంగీతం, నృత్యం, పేపర్ కటింగ్, కథలు చెప్పడం తదితర అంశాలలో విద్యార్థులకు ప్రవేశం, ప్రావీణ్యం లభిస్తాయన్నారు. ఇలాంటి అవకాశం విద్యార్థులకు మళ్లీ సంవత్సరానికిగాను లభించబోదని, విద్యార్థులు ఇదే మంచి అవకాశమని శిబిరంలో శిక్షణ పొందాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం మాట్లాడుతూ ఇప్పటికే రెండు చోట్ల ఈ శిబిరాలు నిర్వహించామని, వీలును బట్టి నగరంలోని మరికొన్నిచోట్ల కూడా నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు విద్యార్థులకు అభ్యుదయ గీతాలను గానం చేయడం నేరిపించారు. మేజిషియన్లు ఇంద్రజాల ప్రదర్శన చేశారు. చిత్రకళ ఉపాధ్యాయులు శ్రీనివాసులు సులభ పద్ధతిలో బొమ్మలు గీయడం నేర్పారు. విద్యార్థులంతా ఎంతో ఉల్లాసంగా, ఆసక్తిదాయకంగా శిబిరంలో పాల్గొన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బాల బయన్న, పాఠశాల ప్రతినిధి అబ్దుల్ గఫూర్, సంస్థ ప్రతినిధులు సమీర్‌బాషా, వెంకటేశ్వర్లు, డాక్టర్ మామిడి బాబు, సునీత, శివరాం, పి.కిరణ్‌కుమార్, రంగనాయకులు, కామేశ్వరమ్మ, అరుణ, డాక్టర్ చంద్రప్రకాశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రాయచోటి-వేంపల్లి రహదారి మార్గంలో వెలసిన మర్రిచెట్టు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుర్నూతల అగ్రహారానికి చెందిన అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. గాండ్లపల్లికి చెందిన కుర్నూతుల కృష్ణ, నాగేంద్ర కుటుంబ సభ్యులు స్వామివారికి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ యువనాయకులు లల్లుయాదవ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయచోటి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవీ కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పెంచల నరసింహస్వామి ఆలయ ప్రాంగణం వద్ద విద్యుత్ కాంతులతో అలంకరించిన కటౌట్లు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం నరసింహస్వామి కొండపై వెలసిన పెంచల నరసింహస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే లక్ష్మీదేవి ఆలయం వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బుధవారం జరగనున్న కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్ల చురుగ్గా చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్దగుండాల్ రెడ్డి, ఈటమాపురం శంకర్ రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు కల్యాణోత్సవంలో విరివిగా పాల్గొనాలని కోరారు.

కరుణించవా.. కాలభైరవా

- నేటి నుంచి శ్రీ కాలభైరవుడి తిరునాల
- మూడు రోజుల పాటు ఉత్సవాలు



గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి ఆలయం



ప్రత్యేక అలంకరణలో శ్రీ కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన శ్రీ కాల భైరవుడి తిరునాల అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న మంగళవారం స్వామి వారిని వెలుగల్లు వద్ద ఉన్న గండిమడుగులో అభిషేకాలతో తిరునాల మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఇక రెండవ రోజు 22వ తేదీ బుధవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, కాలభైరవుడికి అభిషేకాలు, కలశారాధనలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం స్వామి వారికి రుద్రహోమం , అభిషేకాలు, మహామంగళహారతులు నిర్వహిస్తారు. 23వ తేది గురువారం ఉదయం నుంచి స్వామి వారికి గణపతి పూజ నిర్వహించిన తరువాత శ్రీ కాలభైరవుడికి ప్రత్యేక అలంకరణ, మహామంగళ హారతి, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు రాత్రి అంగరంగవైభవంగా విద్యుత్‌దీపాల మధ్య చాందినీ బండ్లు మెరవణితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 24న శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారి మైలు తిరునాల, అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ తిరునాల మహోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ పాలక మండలి సభ్యులు కోరారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ

నిమ్మనపల్లె : వైద్య పరీక్షల ద్వారా హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని మదనపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ అన్నారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి లో నిర్వహించిన 104 వాహన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అనంతరం నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రికార్డులను, రోగుల ఓపి పరిశీలించారు. డాక్టర్ ప్రత్యూష ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వివరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో 104 వాహన ద్వారా వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. 12 వారాల లోపు హై రిస్క్ గర్భిణులను గుర్తించి, వైద్యుల సూచనలు పాటించేలా, సరైన పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు.104 వాహన వైద్య సేవల ద్వారా వృద్ధులకు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు బీపీ, షుగర్ వంటి ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించి, తగిన చికిత్సలతో పాటు మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎం ఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎం చెన్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ కోసం స్వామి, అమ్మవార్లను అందంగా అలంకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారి మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అలాగే ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శేష వాహనంపై వెంకటేశ్వరుడు



పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వరుడు పెద్ద శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. స్థానిక నెహ్రూనగర్‌కు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. బండమీదకమ్మపల్లెకు చెందిన ఉభయదారులు హంసవాహనంపై స్వామిని ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగి పాండు, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారణలో అమ్మవారు

ములకలచెరువు: మండలంలోని బురకాయల కోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరునాలను రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహకులు ఏరాట్లు చేశారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె : మల్లయ్య కొండపై వెలసిన శ్రీభమరాంబిక మల్లికార్జునస్వామిని భక్తులు సోమవారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పలువురు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లె వన్ డిపో నుంచి మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడిపారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. కురబలకోటకు చెందిన రమణ భార్య భాగ్యమ్మ(30) కూలిపనులకై మద్దిరెడ్డిపల్లెకు వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి ఆమె జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.